తాళ్లబురిడిలో దాహం కేకలు

మంచినీటి కోసం మహిళల అవస్థలు

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. త్రాగునీరు లేక మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గడిచిన కొద్ది రోజుల నుంచి గ్రామంలో తాగునీరు సరఫరా కాకపోవడంతో చేసేదిలేక సమీపంలో గల గెడ్డలను, నేలనూతులను ఆశ్రయించి దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఇదే గ్రామంలో మండల జెడ్పీటీసీ ఉన్నప్పటికీ గ్రామంలో ప్రజలు త్రాగేందుకు త్రాగునీరు కూడా పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడం విచారకరం. ఇటు అధికారుల నిర్లక్ష్యం అటు ప్రజాప్రతినిధుల అలసత్వం వెరసి మండల ప్రజలకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఒకవైపు జిల్లాలో ఎక్కడా కూడా నీటి ఎద్దడి ఉండకూడదని జిల్లా కలెక్టర్ పదేపదే హెచ్చరిస్తున్నా అది మండల స్థాయి అధికారులకు చేరడం లేదు. భానుడి ప్రతాపానికి అధిక ఉష్ణోగ్రత మూలంగా ప్రజలు ఉక్కపోతతో ఒకవైపు తల్లడిల్లి పోతుంటే మరోవైపు గ్రామ స్థాయిలో దాహార్తిని తీర్చుకునేందుకు కూడా పూర్తి స్థాయిలో తాగునీరు అందకపోవడం విచారకరం. ప్రధానంగా గ్రామంలో గల ఎస్సీ వీధి, పాత బజార్, మద్ది వీధి, ప్రధాన రహదారి, ఎల్లమ్మ వీధిలో సక్రమంగా తాగునీరు సరఫరా కాక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. సహనం కోల్పోయిన మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో వారి నిరసనను వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటికో కొళాయి చొప్పున ఉన్నప్పటికీ అవి దిష్టిబొమ్మలుగా మారాయి తప్ప చుక్క నీరు తాగేందుకు ఇవ్వలేకపోతున్నాయని మండిపడ్డారు. చేతి బోర్లు ఉన్నప్పటికీ అవి ఇంటి వాడుకకు, ఇతర అవసరాలకు ఉపయోగపడతాయి తప్ప త్రాగేందుకు పనికి రావని తక్షణమే గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించకపోతే మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే తాళ్ల బురిడీలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన సంగతి తెలిసిందే.

లక్షలు వృధా... నెరవేరని లక్ష్యం....

బస్ షెల్టర్ ఉన్నా, ప్రయాణికులకు ఉపయోగపడని వైనం
వినియోగంలోకి రాని మరుగుదొడ్లు
చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - చింతపల్లి: మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి మందిరం (బస్ షెల్టర్), ప్రజా మరుగుదొడ్లు అలంకారప్రాయంగా తయారయ్యాయి. వీటి నిర్మాణం వలన లక్షలాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయి తప్ప వాటి వలన ప్రయాణికులకు ఎటువంటి ఉపయోగం లేదు. ఆర్టీసీ సర్వీసులు ఆగేచోట కాకుండా ఉపయోగం లేని చోట బస్సు షెల్టర్ నిర్మించడం వలన సాధువులకు తప్ప ఆ బస్సు షెల్టర్ ప్రయాణికులకు ఏ విధంగానూ ఉపయోగపడడం లేదు. అదే క్రమంలో దాని సమీపంలోనే ప్రజా మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ నీటి సదుపాయం లేకపోవడంతో అవి వినియోగంలోకి రాని పరిస్థితి తలెత్తింది. ఇవి రెండు ప్రయాణికులకు ఏ విధంగానో ఉపయోగపడనప్పటికీ బస్ షెల్టర్ వద్ద, ప్రజా మరుగుదొడ్ల చెంత అపారిశుధ్యం రాజ్యమేలుతుంది. వీటికి తోడు రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించినప్పటికీ ఆ కాలువలలో చేరిన మురుగు నీరు లోతట్టు ప్రాంతాలకు పోయే మార్గం లేకపోవడం అదే క్రమంలో ఆ

కాలువలలో పేరుకుపతున్న చెత్త చెదారంతో దుర్గంధం

వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్త చెదారం కారణంగా మురుగు నీరు నిల్వ ఉండడం వలన, అదేవిధంగా ప్రజా మరుగుదొడ్ల చెంత ప్రజలు, ప్రయాణికులు బయటనే మూత్రం పోయడం వలన దుర్గంధంతోపాటు దోమల వ్యాప్తి అధికమై వ్యాధులు ప్రభలే ప్రమాదం లేకపోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత సాకల అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పదవీ విరమణ ఎస్సై ఎస్ఐకి సత్కారం

విశాలాంధ్ర - పార్వతీపురం: పోలీస్ శాఖలో 40 సంవత్సరాల సుదీర్ఘకాలంపాటు ఉత్తమ సేవలు అందించి ఎన్నో సమస్యలను ఎదురొడ్డి, కష్ట నష్టాలు ఓర్చి ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ చెందటం అదృష్టమని పదవీ విరమణ గౌరీశంకర్రావుకు పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్

శాఖ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు చెబుతున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ శాఖలో స్పెషల్ బ్రాంచ్ నందు సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన గౌరీ శంకర్రావును, ఆయన కుటుంబసభ్యులను దుశ్శాలువా కప్పి సత్కరించి మెమొంటో అందజేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, ఎస్బి సిఐ రంగనాథం, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వాతావరణ శాఖ విడుదల చేసిన సూచనల మేరకు జిల్లా అధికారులతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, గాలులు 60 కిలోమీటర్లు వేగంతో వీస్తాయని వాతావరణ శాఖ సూచనలు చేసిందన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. భారీ వర్షాలు కారణంగా ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రదేశాలు గుర్తించి అటువంటి ప్రదేశాల వద్ద అప్రమత్తం చేయాలని ఆయన ఆదేశించారు. రహదారులు, కల్వర్టుపై నుండి నీరు పారే చోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని, వ్యాధులు ప్రబల కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ గ్రామాల్లో వైద్య పరిస్థితుల పట్ల పూర్తి శ్రద్ధ వహించాలని ఆయన చెప్పారు.

పది విద్యార్థులు క్రమశిక్షణతో చదవండి

విశాలాంధ్ర - సీతంపేట: ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులు కాని 137 మంది విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ప్రాజెక్ట్ అధికారి యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఫెయిల్ అయిన బాలికలకు ఆశ్రమ పాఠశాల సీతంపేటలోను బాలురకు బాలుర ఆశ్రమ పాఠశాల సీతంపేటలోను శిక్షణ తరగతులను ఏపీఓ చిన్న బాబు, డిడి అన్నాదొర, ఉప విద్యాశాఖ అధికారి కేఆర్పి కుమార్, పీఎంఆర్సీ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని, విషయ నిపుణుల ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ మే 19 నుండి జరగబోయే సప్లిమెంటరీ పరీక్షల్లో చక్కగా రాసి ఉత్తీర్ణత సాధించాల్సిందిగా కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో ఏఎంఓ కోటి బాబు, సిఎంఓ చిరంజీవిలు, జీసీడీఓ రాములమ్మ, ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, వసంతలక్ష్మి, విషయ నిపుణులు వేణుగోపాల్, కామేశ్వరరావు, ఊర్మిళ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ధర్మారావు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కర్రి ధర్మారావు నియమితులయ్యారు. ఈయన గుమ్మలక్ష్మీపురం మండలంలో పంచాయతీ విస్తరణ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చి బుధవారం విధులలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులను నిర్వహిస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. అయితే ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శంబంగి రమేష్ కొమరాడ మండలానికి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

శ్యామలాంబ పండగకు పటిష్ట ఏర్పాట్లు

ఎస్పీ మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర - సాలూరు: పట్టణంలో మే 18, 19, 20 తేదీలలో జరగనున్న శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండగకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ ఎస్వి మాధవ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో శ్యామలాంబ ఆల యాన్ని సందర్శించి కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. 15 సంవత్సరాల తరువాత పట్టణ ప్రజలు జరుపు కుంటున్న శ్యామలాంబ పండుగకు ట్రాఫిక్ నిబంధనలు, బందోబస్తు ఏర్పా ట్లపై ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని భక్తులకు సురక్షితమైన, సులభమైన దర్శనం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సిరిమాను, అమ్మవారి ఘటాలు తిరిగే ప్రతీ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు, సలహాలి చ్చారు. భక్తుల యొక్క వ్యక్తిగత భద్రతను దృష్టిలో పెట్టుకొని అన్ని ప్రదేశాలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నాన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమారాల నిఘా నీడలో అమ్మవారి పండుగకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పట్టణంలో ఇరుకు ప్రదేశం ఉన్నందున వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని కొన్ని ఆంక్షలు విధించామని చెప్పారు. పండుగ ముందు రోజు నుండి పట్టణంలోకి ఎలాంటి వాహనాలను అనుమతించబోమని చెప్పారు. పట్టణానికి వెలుపల నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను నిలుపుకోవాలన్నారు. నిర్దేశించిన ఆటోల్లో పట్టణంలోకి చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో పాలకొండ డిఎస్పీ రాంబాబు, సాలూరు పట్టణ, రూరల్ సిఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ అక్కాన అప్పారావు, సభ్యులు నిమ్మాది తిరుపతిరావు, యుండుపూరి నారాయణరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

విశాలాంధ్ర - మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కురసాని నూకమ్మ అలియాస్ ఉమ మృతి చెందింది. తూరుమామిడి సమీప రోడ్డులో స్కూటీని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై వస్తున్న ఉమ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. నూకమ్మ బొబ్బిలి ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని సాలూరు సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు. విద్యార్థిని మృతితో కుటుంబం ఒక్కసారిగా విషాదంలో మునిగింది. అలాగే తూరుమామిడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హెల్పర్ పోస్టు అమ్ముకున్నారు: కలెక్టర్‌కు ఫిర్యాదు....

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అంగన్వాడి కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీ ప్రక్రియ సజావుగా జరగలేదని లంచాలు ఇచ్చిన వారికి పోస్టులను కట్టబెట్టారని ఓ మహిళ నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకెళ్తే మండలంలోని బాలగుడబ అంగన్వాడి కేంద్రం 2లో సహాయకురాలు పోస్టుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందరి మాదిరిగానే అదే గ్రామానికి చెందిన కింతలి ఉషారాణి ఇంటర్మీడియట్ చదువుకోవడంతో హెల్పర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. అంతేకాకుండా మౌఖిక ఇంటర్వ్యూకు కూడా హాజరై ఆమె ప్రతిభను చూపారు. అయితే ఫలితాలు వచ్చేసరికి మాత్రం ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. గ్రామానికి చెందిన కొందరు కూటమి నాయకులు ఎటువంటి అర్హత లేని రాజన్న శివమ్మకు హెల్పర్ పోస్టును మూడు లక్షలకు అమ్ముకు న్నారని దరఖాస్తు దారురాహ్న ఉషారాణి ఆరోపించడమే కాకుండా ఇటీవల జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో నేరుగా ఫిర్యాదు చేసింది. అంగన్వాడి నియామకాల్లో జరిగిన ఇంటర్వ్యూలు దరఖాస్తుదారుల విద్యార్హత తదితర వాటిపై జిల్లా కలెక్టర్ నేరుగా విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఉషారాణి ఇంటర్మీడియట్ చదువుకుంది.

బాల్యంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. దాంతో మేనమామ ఇంట్లో ఉండి ఎంతో కష్టపడి ఇంటర్ పూర్తి చేసింది. ఈమెకు వివాహమైన కొన్నాళ్లకే భర్త అనారోగ్యంతో చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో జీవనాన్ని ఎంతో కష్టంగా సాగిస్తుంది. కుమారుడు వికలాంగులు కావడం ఆమె చేసుకున్న దురదృష్టంగా చెప్పాలి. కేవలం లంచాలు ఇచ్చిన వారికే ఉద్యోగాలు వస్తున్నాయి తప్ప ప్రతిభ ఉన్న వారికి మాత్రం న్యాయం జరగడం లేదని బాధితురాలు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఏజెన్సీ డీఎస్సీకై ఆర్డినెన్స్ జారీ చేయాలి

విశాలాంధ్ర - పాడేరు: ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్‌కై ఆర్డినెన్స్ జారీ చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కుడుముల కాంతారావు డిమాండ్ చేశారు. బుధవారం పాడేరు మోదకొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణం నుండి కింద బజార్ మీదుగా ఐ.టి.డి.ఏ వరకు ప్రదర్శన చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. ఐ.టి.డి.ఏ ఎదురుగా పోలీసులకు, నిరుద్యోగులకు ఘర్షణ జరిగింది. బారికేడ్లను తోసుకుంటూ ఐ.టి.డి.ఏ గేట్ వరకు సాగింది. అక్కడే సుమారు గంటపాటు నినాదాలు చేస్తూ అనంతరం మెయిన్ రోడ్డుకు అడ్డంగా ఆందోళనకారులు బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధకృష్ణ అధ్యక్షత వహించారు. ధర్నాలో గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కుడుముల కాంతారావు మాట్లాడుతూ నూరు శాతం రిజర్వేషన్ ఆదివాసీలకు ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి అరకు ఎన్నికల ప్రచారానికి వచ్చి హామీ ఇచ్చారని అది అమలు కాలేదన్నారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నరస మాట్లాడుతూ మెగా డీఎస్సీలో 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో 100 శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వలేదని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ చర్య వల్ల జనరల్ డీఎస్సీ నోటిఫికేషన్‌తో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అభద్రత భావం, ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు పి.అప్పల నరస, కె.సురేంద్ర, పి.బల్ దేవ్, ధర్మాన పడల్, కుడుముల కాంతారావు, వల్ల సలీం, ఎస్.మాణిక్యం, వయబరికి మహేశ్వరరావు, పి.దేముడు,కూడ సుబ్రహ్మణ్యం, కూడ రాధాకృష్ణ, వంతల నాగేశ్వరావు, వంతల దాస్, సింహాద్రి, వై.కుమార్, దన్నేటి పలాస శంకర్, పాత్రుడు రాధా, మత్స్యరాస వెంకట రాజు, రబ్బ ప్రశాంత్ కుమార్, మొండిపల్లి చిరంజీవి, కోర్ర చిన్నారి, పిట్ట నరేష్, సోమేలి బాలరాజు, భాను, ఎం.లక్ష్మణరావు, ఎస్.లక్ష్మణరావు, జీవన్, కార్తీక్, దీసరి గంగరాజు, చిన్నస్వామి, చట్టు మోహన్, బి.రాంబాబు, టి.కృష్ణారావు, ఎస్.కొండల రావు, కెజియరాని, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే ఉద్యోగికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది

పదవీ విరమణ సభలో డీఆర్ఓ

విశాలాంధ్ర - హుకుంపేట: కష్టపడి పని చేసిన ప్రతి వ్యక్తికీ మంచి గుర్తింపు లభిస్తుందని దానికి నిదర్శనం తహశీల్దార్ కే.జయప్రకాష్ అని జిల్లా రెవెన్యూ ఆఫీసర్ కె.పద్మలత పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ జయప్రకాష్ దంపతుల పదవీ విరమణ సందర్భంగా హుకుంపేట డిప్యూటీ

తహశీల్దార్ సిహెచ్ కృష్ణారావు, జి.మాడుగుల డిప్యూటీ తహశీల్దార్ రాజ్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో విధులు నిర్వహించిన 6 నెలల్లో ఆయన నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విశేష సేవలందించారని కొనియాడారు. రెవెన్యూ శాఖలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్న వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొంటూ ప్రజలకు న్యాయం చేసే వ్యక్తిని నేడు సన్మానించటం సంతోషంగా ఉందని పలు శాఖల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి రెవెన్యూ అధికారులు, గూడ సర్పంచ్ కంబిడి సరోజిని, టిడిపి నాయకులు కంబిడి జ్ఞానప్రకాష్, మండల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీని బలోపేతం చేస్తాం

రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర - అనంతగిరి: జీసీసీ బలోపేతానికి కృషి చేస్తామని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. విశాఖ జిల్లా కేంద్రంలో గిరిజన సహకార సంస్థ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బోర్డు మీటింగ్‌లో పలు కీలక నిర్ణయాలను గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తీసుకున్నారు. గత దశాబ్ద కాలంగా నిలిచిపోయిన పదోన్నతులను పరిష్కరిం చడంలో ముందు చూపుతో సంస్థ నిర్మాణం బలోపేతం ధ్యేయంగా చైర్మన్ శ్రావణ్ కుమార్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. జూనియర్ అసిస్టెంట్స్ నుండి సీనియర్ అసిస్టెంట్ స్థాయికి పదోన్నతులు అలాగే సీనియర్ అసిస్టెంట్‌లను జూనియర్ మేనేజర్ స్థాయికి పదోన్నతులు ఇస్తూ అలాగే ఫీల్డ్ స్థాయిలో ఉన్న మేనేజర్స్ ఖాళీలను నింపేం దుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. నిర్వాహక సమర్థతను బలోపేతం చేయడం కోసం కంప్యూటర్ ఆపరేటర్ అలాగే ఇతర ఎగ్జిక్యూటివ్స్ పాత్రల వంటి ఫీడర్ కేడర్ ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో రానున్న రోజుల్లో భర్తీ చేస్తామని అన్నారు. అరకు వ్యాలీ కాఫీ ఫ్రాంచైస్ అవుట్ లెట్స్ ఏర్పాటు చేసి గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్ పెంచడంతో పాటు మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తూ జీసీసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జీసీసీ బలోపేతం లక్ష్యంగా పదోన్నతులు కల్పిస్తూ జీసీసీ ద్వారా ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని, త్వరలో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తాం అని కారుణ్య నియామకాలు జరిగి విధంగా ముఖ్యమంత్రి అనుమతి వస్తే నియామకాలు భర్తీ చేస్తామన్నారు.

మన్యం బంద్‌ను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఈనెల 2వ తేదీన నిర్వహించే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ మత్స్యరాస నారాయణ రాజు పిలుపునిచ్చారు. ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో వేలాదిమంది డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో మెగా డీఎస్సీ నిర్వహిస్తే వేలాదిమంది గిరిజన డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తు అంధకారంలో పోతుందని తెలిపారు. షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక చట్టం తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలన్నారు. ఉపాధ్యాయుల పోస్టులు మాత్రమే కాకుండా షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న వివిధ ఉద్యోగాలు కూడా గిరిజన అభ్యర్థులకు ఇవ్వాలని అన్నారు. మే 2న నిర్వహించే బంద్‌లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పని చేయుచున్న అధికారులు, సిబ్బంది ప్రజలకు మంచి సేవలు అందించిన ఎడల ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో ఐటీడీఏ కార్యాలయంలో వలల కృష్ణారెడ్డి సుమారు 38 సంవత్సరాల పాటు అటెండర్‌గా పనిచేసి పదవి విరమణ కార్యక్రమానికి రంపచోడవరం ఐటిడిఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజన ప్రజలకు సుమారు 38 సంవత్సరాల పాటు ఐటీడీఏ కార్యాలయంలో అందరితో మంచి మన్ననలు పొందిన వలల కృష్ణారెడ్డికి ప్రజల్లో మంచి పేరు సంపాదించారని అదేవిధంగా వివిధ కార్యాలయాల్లో పనిచేయుచున్న అధికారులు, సిబ్బంది ప్రజలకు మంచి సేవలందించిన ఎడల ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం పదవి విరమణ చేయుచున్న వలల కృష్ణారెడ్డి మాట్లాడుతూ 1987 మార్చి 16వ తారీఖున ఐటీడీఏ కార్యాలయంలో అటెండర్‌గా జాయిన్ అవ్వడం జరిగిందని అదేవిధంగా సుమారు 20 సంవత్సరాల పాటు ప్రాజెక్ట్ అధికారి వారి దగ్గర దఫేధార్‌గా, 9 సంవత్సరాల పాటు హెచ్ఎంటిసి ఈహెచ్ఎంటిసి ఫారంలో అటెండర్‌గా పనిచేయడం జరిగిందని ఇప్పటి వరకు ఐటీడీఏ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేయడం జరిగిందని ఆయన అన్నారు. నా 38 సంవత్సరాల పాటు సర్వీస్‌లో అధికారులు, సిబ్బంది నన్నెంతగానో ఆదరించారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎస్ఓ మార్తమ్మ, స్వామి, బిఎస్ కుమార్, ఐటీడీఏ మేనేజర్ బి. రాజు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగభూషణం, లక్ష్మి, శ్రీకాంత్, రాజమణి, చదల సోమిరెడ్డి, నరసింహారావు, శివ, జి.ఆనంద్, సబ్ అసిస్టెంట్లు నూకరాజు, నాగరాజు, శోభన్, శివ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అంటూ గిరిజన నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం

విశాలాంధ్ర - జి.మాడుగుల: కూటమి ప్రభుత్వం డీఎస్సీ అంటూ గిరిజన నిరుద్యోగులను మోసం చేసిందని అల్లూరి సీతారామ జిల్లా వైసీపీ యూత్ అధ్యక్షులు గబ్బాడి శేఖర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గిరి ప్రాంతంలోని డీఎస్సీ పోస్టులు ఉద్యోగాలు గిరి ప్రాంతం నిరుద్యోగులకు వస్తాయని ఆశించారని కానీ ప్రభుత్వం ప్రభుత్వం ఆకలితో ఉన్నవారికి ఎంగిలి ఆకు విసిరినట్టు డీఎస్సీ ప్రకటించిందని ఆయన విమర్శించారు. ఈ ప్రాంతంలోని నూటికి నూరు శాతం ఉద్యోగాలు గిరిజన ప్రాంత నిరుద్యోగులకు కేటాయించాలని అన్నారు. గిరిజన ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు గిరిజన నిరుద్యోగులతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక డిఎస్సి కోసం మే 2 శుక్రవారం ఇచ్చిన రాష్ట్ర గిరిజన ప్రాంతం బంద్‌కు వైసీపీ మద్దతు ఉంటుందని ప్రతి ఒక్కరూ బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ: ఇద్దరు యువకులు మృతి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. మండల కేంద్రంలోని శబరి రాయిగూడెం, సమీపంలో ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే వరరామచంద్రాపురంలో క్రికెట్ టోర్నమెంట్ ఆడి వారి స్వగ్రామం వెళ్తుండగా రామవరం పంచాయితీకి చెందిన కారం చంద్రయ్య, మడకం నరేష్‌ని బజాజ్ మ్యాక్స్ ఆటో బలంగా ఢీకొట్టింది. నరేష్ చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందగా, కారం చంద్రయ్య భద్రాచలం ఆసుపత్రిలో మృతి చెందారు. స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ రేఖపల్లి గ్రామానికి చెందిన నూలు సురేష్‌గా గుర్తించారు.

అనుమతులు కొన్నింటికే...తరలింపు అన్నింటినీ...?

వృక్ష సంపదపై గొడ్డలి వేటు...! రెవెన్యూ, అటవీ శాఖ లీలలు ఇతరప్రాంతాలకు తరలిపోతున్న టేకు వృక్ష సంపద

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: విలువైన వృక్ష జాతికి చెందిన టేకు సంపద తరలిపోతుంది. కలప వ్యాపారస్తులు, స్మగ్లర్లు కలిసి టేకు సంపదపై గొడ్డలి వేటు వేస్తున్నారు. దీంతో ఎంతో విలువైన టేకు జాతి సంపద కలప వ్యాపారస్తులకు కోట్ల రూపాయలు ఆదాయం తెచ్చిపెడుతుంది. నామమాత్రంగా అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకొని కోట్ల రూపాయలు విలువ చేసే టేకు కలపను ఇతర ప్రాంతాలు రాష్ట్రాలకు తరలించుకు పోతున్నారు. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు కలప స్మగ్లర్లు ఇచ్చే లంచాలు తీసుకొని విలువైన వృక్షజాతిని హరిస్తున్నారని కొందరు వృక్ష ప్రేమికులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. వాస్తవానికి విలువైన వృక్ష సంపదను నేల కూల్చాలన్న, అది ఇతర ప్రాంతాలకు తరలించాలన్న అధికారికంగా జరగాలి. ఈ ప్రక్రియ జరగాలంటే కలప వ్యాపారం చేస్తే వ్యాపారస్తులు సంబంధిత రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి సంబంధిత విఆర్ఓ ఉన్నతాధికారులకు నివేదిక అందించాలి. దీనిపై వాస్తవాలను తెలుసుకునేందుకు ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎన్ని మొక్కలు ఉన్నాయి...? అందులో ఎన్ని మొక్కలను కోతకు గురిచేస్తారు...? దీనిపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నాయా ...?వాస్తవానికి నరుకుతున్న మొక్కలు సంబంధిత రైతు వారి పట్టాలో ఉన్నాయా లేదా ప్రభుత్వ స్థలంలో ఉన్నాయా దీనిపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నాయన్నది నిర్ణయించాలి. ఆ వృక్ష సంపద గల తోటపై ఎటువంటి అభ్యంతరాలు అనుమానాలు లేకపోతే తాసిల్దార్ కు నివేదిక అందజేయాలి. దీనిపై తాసిల్దార్ పూర్తి దృష్టి సారించి మొక్కలు నరకడానికి

సంబంధిత క్లియరెన్స్ లు ఇస్తారు. ఆ పత్రాల ఆధారంగా సంబంధిత కలప వ్యాపారి అటవీ శాఖను ఆశ్రయిస్తాడు. దీనిపై అటవీ శాఖ అధికారులు కూడా శాఖా పరంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. అనంతరం ఎన్ని మొక్కలను తొలగిస్తారు వాటిని ఏ ప్రాంతాలకు తరలిస్తారు అన్నదానిపై పూర్తిస్థాయి ఆరా తీసి అనుమతులు ఇస్తారు. అయితే ఈ ప్రక్రియ అంతా నాణేకిమ్మికి ఒకవైపనే చెప్పాలి. ఇరు శాఖల అధికారులు లంచాల మత్తులో జోగుతూ కలప స్మగ్లర్లకు కొమ్ము కాస్తున్నారు. నిబంధనలను గాలికి వదిలేసి లంచాల మత్తులో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. మండలంలోని డోకిశీల పంచాయతీ పరిధిలో పట్టణానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుని టేకు తోట ఉంది. ఈ తోటలో గల వృక్ష సంపదను ఇతర ప్రాంతాలకు చెందిన కలప వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి వెళ్లేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ వ్యవహారంలో అటవీశాఖ తో పాటు రెవెన్యూ శాఖకు భారీ స్థాయిలో ముడుపులు ముట్టినట్లు తెలుస్తుంది. మొత్తం 300 మొక్కలు నరికేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఇరు శాఖల అధికారులు చెబుతున్నప్పటికీ ఈ వ్యవహారంలో పెద్ద స్థాయిలోనే టేకు మొక్కలను తొలగించినట్లు గ్రామస్తులు అంటున్నారు. అనుమతులు నామమాత్రంగా కొన్ని మొక్కలకు తీసుకొని ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుమును చెల్లించి భారీ స్థాయిలో టేకు మొక్కలను ఇతర ప్రాంతాలకు తరలించకపోయేందుకు అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఇందుకు సంబంధించి మక్కువ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారాయణరావును వివరణ కోరగా టేకు మొక్కలు నరికేందుకు సంబంధిత దరఖాస్తుదారుడు దరఖాస్తు చేసుకోగా ఉన్నతాధికారులు పరిశీలించారని అలాగే రెవిన్యూ పరంగా కూడా ఇటువంటి అభ్యంతరాలు లేకపోవడంతో పెరిమిట్ ఇచ్చినట్లు వివరించారు. ఏదేమైనా ఈ వ్యవహారంపై లోతుగా పరిశీలన చేస్తే జరుగుతున్న అక్రమ కలప వ్యాపార బాగోతం బట్టబయలు కానుంది.

మహాత్మ శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పార్వతీపురం: సమాజంలోని కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయ వాది మహాత్మ శ్రీ బసవేశ్వరని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక తెలిపారు. ఆయన బోధించిన తత్వాలు దేశమంతా విస్తరించాయని, ప్రేమతత్వం, సమానత్వం, బసవతత్వం ప్రబోధించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మహాత్మ శ్రీ బసవేశ్వరుని జయంతి వేడుకలు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన బుధవారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె బసవేశ్వర చిత్ర పటానికి పూలమాలను వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ లింగాయత్‌లు సంప్రదాయబద్ధంగా జరుపుకునే బసవన్న జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని అన్నారు. 12వ శతాబ్దపు హిందూ కన్నడ కవి మరియు తత్వవేత్త బసవేశ్వర అని ఆమె కొనియాడారు. నాటి కాలంలోనే కుల వ్యవస్థ లేని అందరికీ సమాన అవకాశాలు ఉండే సమాజాన్ని బసవన్న విశ్వసించే వారని, ఆయన అనుభవ మంటప అనే అకాడమీని కూడా స్థాపించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మచంద్రారెడ్డి, కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను పరిరక్షించుకుందాం

విశాలాంధ్ర - చింతపల్లి: 5వ షెడ్యూల్ ఏరియాలో గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా పీసా కమిటీ పని చేస్తుందని పీసా కమిటీ మండల ఉపాధ్యక్షుడు డి.రామకృష్ణ అన్నారు. పీసా కమిటీ మండల సమావేశం బుధవారం చింతపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీసా మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో మండల ఉపాధ్యక్షుడిగా డి.రామకృష్ణ, గౌరవ అధ్యక్షునిగా సాగిన వెంకటరమణ, ఎం.వెంకటరమణ, ఎస్.రామారావు, జి.నాగేశ్వర రావు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను సమిష్టిగా పరిరక్షించుకుందామన్నారు. అనంతరం మన్య ప్రాంతంలో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారానికై స్థానిక తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలలో ఆయా శాఖల అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన పీసా కమిటీ ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు

డి.ఆర్.డి.ఏ పీడీ ఎం.సుధారాణి వెల్లడి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లావ్యాప్తంగా నేడు ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు పంపిణీ జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం.సుధారాణి తెలిపారు. పేదల సేవలో భాగంగా జిల్లాలోని 1,39,752 మందికి రూ.59.72 కోట్ల నిధులను పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఒకటవ తేదీ ఉదయం 6.30 గం.లకు పింఛన్ల పంపిణీ ప్రారంభం అవుతుందని తెలిపారు. మొదటి రోజునే శత శాతం పింఛన్లు పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. కురుపాం మండలంలో 6,750 పింఛన్లకు గాను రూ.28.44 లక్షలు, పాలకొండలో 7,204 (రూ.29.89 లక్షలు), మక్కువ 8,270 (రూ.36.45 లక్షలు), సీతానగరం 11,100 (రూ.47.28 లక్షలు), పార్వతీపురం (అర్బన్) 5,400 (రూ.23.79 లక్షలు), పార్వతీపురం 10,675 (రూ.46.13 లక్షలు), సీతంపేట 7,884 (రూ.32.97 లక్షలు), భామిని 6,846 (రూ.29.30 లక్షలు), జియ్యమ్మ వలస 8,759 (రూ.37.52 లక్షలు), గుమ్మలక్ష్మీపురం 6,495 (రూ.26.95 లక్షలు), సాలూరు 8,217 (రూ.35.10 లక్షలు), బలిజిపేట 10,615 (రూ.45.93 లక్షలు), గరుగుబిల్లి 8,022 (రూ.33.76 లక్షలు), పాలకొండ (అర్బన్) 3,349 (రూ.14.37 లక్షలు), పాచిపెంట 6,663 (రూ.28.22 లక్షలు), వీరఘట్టం 9,613 (రూ.41.23 లక్షలు), సాలూరు (అర్బన్) 5,632 (రూ.24.38 లక్షలు), కొమరాడ 8,258 (రూ.35.52 లక్షలు) పంపిణీ కానుందని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించి నివేదికను కలెక్టరు కార్యాలయానికి అందజేయాలని ఆమె తెలిపారు.

అంగన్వాడి నియామకాలపై దర్యాప్తు నిర్వహించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఇటీవల జరిగిన అంగన్వాడీ నియామకాలపై దర్యాప్తు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మన్యం జిల్లా ఓబీసీ చైర్మన్ వంగల దాలి నాయుడు, నియోజకవర్గ ఇన్చార్జ్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, సాలూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ గేదెల రామకృష్ణ, జిల్లా నాయకులు కోల కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావులు పార్వతీపురం మన్యం జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్/ జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికను కలిసి ఇటీవల నియామకాలు జరిగిన అంగన్వాడి ఉద్యోగాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మండలం బాల గుడబ గ్రామానికి చెందిన చింతల ఉషారాణి అనే బాధితురాలు అంగన్వాడి నియామకాలలో తనకు అన్యాయం జరిగిందంటూ తమ కాంగ్రెస్ పార్టీని ఆశ్రయించిందన్నారు. హెల్పర్ ఉద్యోగానికి ఆమె దరఖాస్తు చేసుకోగా, రోస్టర్ పాయింట్ల ప్రకారం, విద్యార్హత ప్రకారం ఆమెకు అర్హతలు ఉన్నప్పటికీ, వేరే వ్యక్తికి ఉద్యోగం కేటాయించారని, తనకు అన్యాయం జరిగిందంటూ, అంగన్వాడి ఉద్యోగి నియామకాల్లో లక్షలు చేతులు మారినట్లు గ్రామంలో చర్చ జరుగుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అంగన్వాడి నియామకాలపై దర్యాప్తు నిర్వహించాలని కోరారు. గతంలో జరిగిన విద్యా, వైద్య శాఖల్లో, రేషన్ డీలర్ల నియామకాలలో ఆరోపణలు వచ్చినట్లు గుర్తు చేశారు. వాటిని బట్టి చూస్తే అంగన్వాడీ నియామకాల్లో కూడా అవకతవకలు జరిగి ఉండొచ్చని తాము అనుమానిస్తున్నామన్నారు. కాబట్టి అంగన్వాడి నియామకాలపై దర్యాప్తు నిర్వహించి బాధితురాలకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా బాధితురాలు కింతలి ఉషారాణి జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతూ తనకు తల్లిదండ్రులు, భర్త లేరని, ఉన్న ఇద్దరు పిల్లల్లో ఒకరు మానసిక వికలాంగుడని కుటుంబ పోషణ కష్టంగా ఉందని వాపోయారు. రోస్టర్ పాయింట్ల ప్రకారం తనకు 80 మార్కులు వస్తాయని, అన్ని అర్హతలు ఉన్న తనకు ఉద్యోగం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై దర్యాప్తు నిర్వహించడం జరుగుతుందని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ శోభిక హామీ ఇచ్చారు.

ఆర్ ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ ఆర్ ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి

విశాలాంధ్ర - చింతపల్లి: పెంటపాడు సమీపంలోని ప్రభుత్వ ఆర్ఐటిఐలో మొదటి విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసా చారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ నందు ఎలక్ట్రీషియన్ -40, మెకానిక్ మోటార్ వెహికల్ -24, ఫిట్టర్ -20, వెల్డర్ -40, ప్లంబర్ -24, వుడ్ వర్క్ టెక్నీషియన్ -24, స్టెనోగ్రాఫర్ -24 సీట్లు ఉన్నాయని ఆసక్తి కలవారు iti.ap.gov.in నందు మే 24 లోపల దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తు చేసిన వారు ఎవరైనా సమీప ప్రభుత్వ ఐటిఐలలో పని దినాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని వెళ్ళి మే 26 లోపల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు, జూన్ మొదటివారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9866108607, 9494377833 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మొద్దులగూడెంలో దాహం కేకలు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: విఆర్ పురం మండలం రాజుపేట గ్రామపంచాయతీలోని మొద్దులగూడెం (తోటపల్లి) ఆర్డబ్ల్యూఎస్ త్రాగునీటి ట్యాంక్ మరమ్మతులకు గురి కావడంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కుంజ రమేష్ తెలిపారు. జలజీవన్ మిషన్ కింద పది లక్షలు రూపాయలు ఖర్చు పెట్టి పైపులైను వేశారు. బోరు వేసి మోటారు వేసి వదిలేశారని, ఒక్కసారైనా చుక్క మంచి నీళ్లు రాలేదన్నారు. వర్షాకాలంలో వచ్చి చూసి చూడనట్టుగా బోరు వేసి బిల్లులు మాత్రం దండుకున్నారని విమర్శించారు. నీళ్లు అందించకుండా వదిలేశారన్నారు. అధికారులు స్పందించి మంచినీటి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

రహదారి నిర్మించండి కదం తొక్కిన ఆటో, ట్రాక్టర్ కార్మికులు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: కూటమి ప్రభుత్వ పాలకుల్లారా తమ రోడ్డులో ఇంకా ఎంతమంది ప్రమాదాలకు బలి అవ్వాలంటు రోడ్డు కోసం సిపిఐ(ఎంఎల్) నాయకత్వంలో ఆటో, ట్రాక్టర్ కార్మికులు, ప్రజలు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ అడ్డతీగల ఏలేశ్వరం మండలాల మధ్యలో రమణయ్యపేట నుండి, గుంటువానిపాలెం జే.అన్నవరం వరకు 15 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడై పోయిందని ఈ రోడ్డులో ప్రయాణమంటే నరకమేనని, ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారి ఎంతోమంది ప్రాణాలు తీస్తుందని వాపోయారు. గత తెలుగుదేశం ప్రభుత్వం నుండి వైయస్సార్ ప్రభుత్వం పాలన పోయి మళ్లీ తెలుగుదేశం కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా పట్టించుకున్న పాపని పోలేదని, ఈ రోడ్డులో ఒక ఎమ్మెల్సీ ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రయాణిస్తుంటారని, అయినా వీరికి చలనం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సోమల కుశల, నాగులపల్లి అర్జునుడు, రెడ్డి ఆనంద పాల్, పార్టీ కార్యకర్తలు మసీరేపు రాజారావు, వల్లి కొండలరావు, నానిశెట్టి పెద్ద సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి బంద్‌ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: మే 2వ తేదీన చేపట్టే బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలో ముంజవరం గ్రామంలో ఆదివాసీ జేఏసీ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి గిరిజనులకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ ప్రాంతంలో అన్ని ఉద్యోగాలు నూటికి నూరు శాతం ఆదివాసీ నిరుద్యోగ యువతకే కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని అందుకే బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఏసీ నాయకులు వంతు బాలకృష్ణ, మండల పీసా కమిటీ అధ్యక్షులు తాము సూరిబాబు, గంప నాగరాజు, ఈపూరి వెంకటరమణ, ఈక గాంధీ, బీరబోయిన రామకృష్ణ, గుమ్మడి ప్రసాద్, ఈక చిన్న నాగరాజు, కొనకం భీమరాజు, నాని, కాకర రామలక్ష్మి, లక్ష్మి, కొనకం వరలక్ష్మి, బాణం అప్పలకొండ, లోత పాపాయమ్మ, లోత చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ కోసం రోడ్డెక్కిన గిరిజన నిరుద్యోగ యువత

మూడు గంటలకు పైగా నిలిచిపోయిన వాహనాలు

విశాలాంధ్ర - రంపచోడవరం: గిరిజన ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ ఎదుట గిరిజన నిరుద్యోగ యువత, ఆదివాసి సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఐటీడీఏ పీఓ, అధికారులు వచ్చి తమ న్యాయమైన డిమాండ్‌లు ప్రభుత్వానికి తెలియజేయాలని కోరినప్పటికీ పీఓ స్పందించకపోవటం పైగా పోలీసులు లోపలకు వెళ్లకుండా గేట్లు మూసి అడ్డు కోవడంతో ఒక దశలో అసహనంకు గురైన ఆదివాసి యువత ఐటీడీఏ గేట్లు బద్దలు కొట్టేందుకు పలుమార్లు ప్రయత్నం చేసినప్పటికీ పోలీస్‌లు తీవ్రంగా ప్రతిఘటించి అడ్డుకున్నారు. అప్పటి వరకు ఐటీడీఏ గేటు ముందు కూర్చొని నిరసన తెలుపుతున్న నిరుద్యోగ యువత ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహానికి లోనై రాజమండ్రి - భద్రాచలం జాతీయ రహదారిపై బైటాయించి పీఓ వెంటనే బైటకు రావాలని, తమ ఉద్యోగాలు తమకే ఇవ్వాలని బిగ్గరగా నినాదాలు చేశారు. అరకు సభలో చంద్రబాబు గిరిజనులు కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని మాత్రమే మేము నెరవేర్చాలని కోరుతున్నామని వెంటనే గిరిజన ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ప్రకటన చేయాలని కోరుతూ తాము శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లోతా రామారావు, వెదుళ్ల లచ్చిరెడ్డి, సిపిఎం నాయకులు కిరణ్, మట్ల వాణిశ్రీ, ఆదివాసి నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

నేడు మేడే వేడుకలు

విశాలాంధ్ర - బెలగాం : ఐ.ఎఫ్.టి.యు జాతీయ కమిటీ పిలుపులో భాగంగా 139వ ప్రపంచ పీడిత ప్రజల దీక్షా దినం మేడే ను ఘనంగా జరపనున్నట్లు పార్వతీపురం వర్తక కళాసీ సంఘం అధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ పార్వతీపురం బెలగాం అగ్రహారం వీధి, బందంవారి వీధి, వర్తక కళాసీ సంఘం భవనం వద్ద మూడు చోట్ల జెండా ఆవిష్కరణ జరుగుతుందని ఆ తరువాత బందంవారి వీధిలో కార్మిక సభ జరుగుతుందని ఈసభలో వక్తలుగా ప్రముఖ కథా రచయిత గంట్యాడ గౌరి నాయుడు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కా. పి. రమణి, ప్రముఖకవి సిరికి స్వామినాయుడు తదితర్లు ప్రసంగిస్తారని అన్నారు. ఈసందర్భంగా అరుణోదయ కళాకారులచే పాటలు ఉంటాయని కావున కార్మికులు శ్రమజీవులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఐ.ఎఫ్.టి.యు జిల్లా కమిటీ కోరుతుందని తెలిపారు.

జిల్లాలో ప్రశాంతంగా పోలీ సెట్ పరీక్ష

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో బుధవారం జరిగిన పాలిటెక్నికల్ (పోలీసెట్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వం ముందస్తుగా కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో ఆయా ప్రవేశ పరీక్ష జరిగింది. మన్యం జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులు శతశాతం ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఎక్కడ ఎటువంటి సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగియడంతో ఇటు విద్యారంగ వ్యవస్థతో పాటు ఇటు పోలీసు వ్యవస్థ ఊపిరి పీల్చుకున్నారు. తుఫాను మూలంగా ఉదయం నుంచి తేలికపాటి జల్లులు కురుస్తున్నప్పటికీ పరీక్షా కేంద్రాలకు సమయానికి ముందే విద్యార్థులు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు కేటాయించడంతో మొత్తం 1679 మంది హాజరై ప్రవేశ పరీక్షలు రాశారు. ఇందులో పట్టణంలో గల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 300 మంది, గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 300 మంది, ఎంఆర్ నగరంలో గల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో 352 మంది అలాగే భాస్కర్ జూనియర్ కళాశాలలో 300 మంది, వేదాంత కాలేజీలో 240 మంది, వాసవి జూనియర్ కళాశాలలో 187 మంది విద్యార్థినీ విద్యార్థులు జరిగిన పోలీసెట్ పరీక్షకు హాజరయ్యారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

విశాలాంధ్ర - బెలగాం : గుర్తు తెలియని రైలు నుండి జారి పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం గుమడ పార్వతీపురం రైల్వే స్టేషన్ల మధ్య సోమినాయుడు వలస రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుండి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడనే

సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడు కురుపాం మండల కేంద్రం పైనెల వీధికి చెందిన వెంట్రాప్రగడ దినేష్ కుమార్ (28)గా గుర్తించినట్లు రాయగడ నుండి పార్వతీపురం వచ్చే క్రమంలో గుర్తు తెలియని రైలు నుండి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చ్యురీకి తరలించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని కుటుంబం కొంతకాలంగా పార్వతీపురం దంగిడి వీధిలో నివాసం ఉంటున్నారు. మృతుని తండ్రి చిన్న గౌరి సోమశేఖర్‌కు ఈమధ్య కాలంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక కాలు పోయింది.

అటవీ నేరములకు పాల్పడితే చర్యలు

డివిజనల్ అటవీశాఖ అధికారి నరసింహారావు

విశాలాంధ్ర - చింతపల్లి: అటవీ నేరములకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అటవీ శాఖ డివిజనల్ అధికారి వై. వి. నరసింహారావు అన్నారు. ఆయన ఆదేశాల మేరకు చింతపల్లి రేంజ్ సిబ్బంది దొడ్డికొండ అటవీ ప్రాంతంలోని రంగురాళ్ళ క్వారీ ప్రదేశంలో బుధవారం సిమెంట్ కాంక్రీట్‌తో రంగురాళ్ల తవ్వకాలు జరిపిన గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ అటవీ ప్రాంతాలలో అక్రమంగా ఎవరైనా సంచరించినా, అటవీ నేరములు - రంగురాళ్ళ త్రవ్వడం, కలప అక్రమంగా తరలించినా, వన్యప్రాణుల వేట, రవాణా మొదలగు అటవీ నేరములలో సంబంధం ఉన్నా, అటువంటి వారిపై శాఖపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పరిసర గ్రామస్తులను హెచ్చరించారు.

గంజాయి రవాణాకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - అనంతగిరి: గిరిజనులు మూఢనమ్మకాలు, గంజాయి రవాణా వంటి వాటికి దూరంగా ఉండాలని గిరిజన ప్రజలకు అరకు సీఐ హిమగిరి, స్థానిక ఎస్సై శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాశీపట్నం జరిగిన వారపు సంతలో వివిధ మారుమూల గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో ఉన్న గిరిజనులు మూఢనమ్మకాలపై ఆధారపడి ప్రాణాలను కోల్పోతున్నారని అంతేకాకుండా చెడు అలవాట్లలో మునిగి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, గంజాయి వంటి మత్తు పానీయం రవాణా చేయవద్దని, దానివలన కేసు నమోదు అయితే కుటుంబం నాశనం అవుతుందని, అంతేకాకుండా గ్రామాలలో అపరిచిత వ్యక్తులు ఎవరైనా వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆన్లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి మోసపోద్దని అలాగే సైబర్ నేరగాళ్లు ఓటిపి కోరినప్పుడు ఇవ్వకూడదని సూచించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు వాహనానికి సంబంధించిన పేపర్లుతోపాటు లైసెన్సు కలిగి ఉండాలని, టూ వీలర్ నడిపే వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

హత్యకేసులో నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర - సాలూరు: పాచిపెంట మండలం తంగ్లాం గ్రామంలో గిరిజనుడు పోయి అప్పలస్వామి హత్య కేసులో నిందితుడు పోయి రాజుని అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ రాంబాబు తెలిపారు. అప్పలస్వామి భార్య పిర్యాదు మేరకు మొదటి అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు. పెళ్లికి వెళ్ళి వస్తుండగా పోయి అప్పలస్వామి ని పోయిరాజు హత్యచేసినట్లు ఆయన అంగీకరించాడని చెప్పారు. హంతకుడు రాజు స్వయంగా విఆర్వో వద్ద లొంగిపోయాడని, ఈనెల 29 న ఆయనని రిమాండ్ కి తరలించినట్లు చెప్పారు. భూ వివాదంతో పాటు అప్పలస్వామి పై చిల్లంగి అనుమానం తో రాజు హత్య చేసినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో రూరల్ సిఐ రామకృష్ణ, టౌన్ సిఐ అప్పలనాయుడు, పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల సమాచారం ఉంటే
1972కు సమాచారం అందించండి

జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో మాదక ద్రవ్యాల సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక అన్నారు. జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల సమాచారం ఎవరి దగ్గర ఏ రూపంలో ఉన్న అందించాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు సహకరించాలని ఆమె కోరారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. పోలీస్ సూపరింటెండెంట్ ఎస్‌వి మాధవ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి భారీన పడకుండా పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పోలీస్ స్టేషన్ లకు మాదక ద్రవ్యాల తనిఖీ కిట్లను అందజేశామని, శిక్షణ కార్యక్రమం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు జిల్లాలో 394 ఈగల్ క్లబ్బులను పాఠశాలలో ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ పక్కాగా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాహనాల తనిఖీ సమయంలో రవాణాశాఖ అధికారులు అన్ని కోణాల్లోనూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్ మాట్లాడుతూ నవోదయ 2.0 క్రింద అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నా మన్నారు. అంతర్రాష్ట్ర తనిఖీల్లో భాగంగా రాయగడ, కోరాపుట్ జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 137 గ్రామాలను సారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించామన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎంఇ రమా జ్యోతి, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఇ.అప్పన్న, జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి ఆషా, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు కవిత, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీలకు పోస్టల్ జీవిత బీమా

విశాలాంధ్ర - రంపచోడవరం: కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) అల్లూరి సీతారామరాజు జిల్లా ఆధ్వర్యంలో పీఎంపీ సభ్యులకు బుధవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి కళ్యాణమండపంలో రాజమండ్రికి చెందిన సన్ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ బాండ్‌లను పీఎంపీ కేంద్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించుకోవడం ద్వారా కుటుంబాలకు భద్రత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సన్ స్టార్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ జమ్ము కోదండరామ్, డాక్టర్ నక్కా సుధాకర్, డాక్టర్ కె.భాగ్యప్రీతిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. జిల్లా కన్వీనర్ కే.జగదీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ కోదండరామ్ మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల వచ్చే ఇబ్బందులలో పక్షవాతం ఒకటని, ఎవరికైనా బ్రెయిన్ స్ట్రోక్ పక్షవాతం వస్తే తొలి మూడు గంటలలో చికిత్స అందిస్తే ఆ రోగిని పక్షవాతం బారిన పడకుండా కాపాడవచ్చని అన్నారు. అలాగే నరాలకు సంబంధించిన రుగ్మతల గురించి వివరించారు. డాక్టర్ నక్కా సుధాకర్ మాట్లాడుతూ మన శరీరానికి ఏదైనా ఇన్ఫెక్షన్లు వస్తే అది ముదిరి సెప్సిస్ అనే ఇబ్బంది కల్గుతుందని, ఈ సెప్సిస్ పై అవగాహన లేక పోతే చాలా ప్రమాదకరంగా మారుతుందని ఇలాంటి అత్యవసర సమయంలో పీఎంపీలు అందించే ప్రథమ చికిత్సల గురించి వివరించారు. డాక్టర్ కె భాగ్యప్రీతి మాట్లాడుతూ మహిళలు ఇబ్బంది

పడే గర్భాశయ రుగ్మతలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ లో కీలకమైన పీఎంపీ లకు జీవిత భీమా ఏర్పాటు చేసిన సన్ స్టార్ హాస్పిటల్ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, ఏఎస్ఆర్ జిల్లా కో కన్వీనర్స్ చిన్నం సిల్వెస్టర్, టీవీవీ సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎమ్ జయరామ్, గోకవరం మండల కార్యదర్శి ఎమ్ జయరామ్, హాస్పిటల్ మేనేజర్ వి.సందీప్‌లతోపాటు సభ్యులు హాజరయ్యారు. అనంతరం వైద్యనిపుణులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

అంతరించిపోతున్న కళలను ప్రోత్సాహిద్దాం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: ప్రస్తుత సమయంలో అంతరించిపోతున్న ఒకప్పటి కీర్తి ప్రతిష్టలు పొందిన రంగస్థల, పౌరాణిక కళలు నేడు అంతరించిపోతున్నాయన్న ఆందోళనతో తిరిగి కళలకు ఊపిరి పోయాలన్న సంకల్పాన్ని కలిగి శంబంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పుట్టపర్తి జిల్లాకు చెందిన తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్. అంజన్నప్ప, ట్రస్ట్ అధ్యక్షుడు సామవేదం బాలసుబ్రమణ్యం, డైరెక్టర్ పెద్దరికం సాయి లు పార్వతీపురం మన్యం జిల్లాలోని సీనియర్ సిటిజన్ కళాకారులకు కళాభిషేకం ప్రశంసా పత్రాలను అందించారు. బుధవారం తురకనాయుడు వలస గ్రామంలో జిల్లాలో గల కళాకారుల పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళా రంగంలో పౌరాణిక, రంగస్థల జానపద కళల ద్వారా మనిషి జీవన విధానాలను ప్రభావితం చేసే విధంగా ప్రదర్శనలు ఉండేవని అయితే ప్రస్తుతం ఆ కళలు కనుమరుగైపోతున్న

సమయంలో ప్రభుత్వాలు, ప్రజలు వాటిని పునఃప్రాణం పోసి నిలపాలని అన్నారు. అలాగే సీనియర్ సిటిజన్ కళాకారులకు ప్రభుత్వం ఆదుకొని వారి జీవనోపాధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగస్థలం కళాకారులు గుండ్రెడ్డి బలరామస్వామి, రొంపల్లి స్వామినాయుడు మాస్టారు, సింహాచలం మాస్టారు, బి అప్పలనాయుడు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి. సీతారాంనాయుడు, ఆర్. లక్షుంనాయుడు, ఆర్. రమణ, ఎం. వెంకటరమణ, వేముల శ్రీనివాసరావు, చిట్టిబాబు, ఎం. దామోదర్ నాయుడుతో పాటు 50 మంది కళాకారులను ఎంపిక చేసి వారందరికీ కళాభిషేకం ప్రశంసా పత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి మూడు పాడి ఆవులు మృతి

విశాలాంధ్ర - పాచిపెంట: మండలంలో గల గోవాడ వలస సమీపంలో గల రైతు మట్టపర్తి సురేష్‌కు చెందిన మూడు పాడి ఆవులు తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి బుధవారం మృతి చెందడంతో రైతు లబో దిబోమంటున్నాడు. మూడు రోజులు క్రితం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగినట్లు రైతు మట్టపర్తి సురేష్ తెలిపాడు. విద్యుత్ వైర్లు తెగిన విషయాన్ని సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియచేసిన పట్టించుకోకపోవడం వల్ల తనకున్న మూడు ఆవులు మృతి చెందాయని రైతు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నాడు. తన జీవనా ధారమైన మూడు పాడి ఆవులు ఖరీదు సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటుందని రైతు తెలిపారు.

అగ్ని బాధిత కుటుంబానికి
నిత్యావసర సరుకులు వితరణ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తోడం రాంబాబు ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని బాధిత కుటుంబానికి 'కృష్ణార్జున ఫౌండేషన్ 'అధ్యక్షుడు కాకునూరు కృష్ణార్జునరావ్ బియ్యం, దుప్పట్లు, బకెట్, చాప, నూనె బాటిల్, సబ్బులు, కూరగాయలు, నిత్యవసర సరుకులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ' ఉప సర్పంచ్ తోడం

బూబమ్మ మాట్లాడుతూ మారుమూల గ్రామమైన మా చొక్కనపల్లి గ్రామానికి వచ్చి అగ్ని బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందించడం అనేది చాలా గొప్ప విషయమన్నారు. మా గ్రామం తరపున కాకునూరు కృష్ణార్జున రావుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తోడం రాజు, పులి ధర్మరాజు, వార్డ్ మెంబర్ గొంది ధారయ్య, తోడం అనీలు, తోడం మంగమ్మ, తోడం సీతారామరాజు, నోముల శ్రీనివా సరావు, బాగుల శ్రీనివాసరావు, గొల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు శుభవార్త

విశాలాంధ్ర - పార్వతీపురం: గరుగుబిల్లి మండలం తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సరస్వతి దేవి ఆలయం ఫిబ్రవరి 5వ తేదీన ప్రతిష్టింపబడినది. ఇకమీదట అక్షరాభ్యాస కార్యక్రమానికి బాసర గాని విజయనగరం గాని దూరప్రాంతాలకి వెళ్లటకు కష్టతరంగా ఉన్న ప్రజలకు తోటపల్లిలో సరస్వతి దేవి ఆలయమునకు వచ్చి మీపిల్లలు బంగారు భవిష్యత్తు నిమిత్తం అక్షరాభ్యాస కార్యక్రమం చేసుకో వచ్చని కమిటీ సభ్యులు తెలిపారు. చిన్న తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి దేవస్థానంలో అన్ని సదుపాయాలు

ఉన్నాయి కనుక భక్తులు ప్రజలు గమనించి తోటపల్లి దేవస్థానంలో ప్రతిష్టింపబడిన సరస్వతి దేవి ఆలయంలో మీ పిల్లల్ని అక్షరాభ్యాస కార్యక్రమాలను జరిపించుకోవాలని కమిటీ సభ్యులు తెలిపారు.